


# నీ ఆనతి - విజయ(కర్రా)గంటి

అప్పటి వరకు సన్నటి తుంపరగా పడుతున్న వర్షం కొద్దిగా ఎక్కువయింది. సౌమ్య ఆఫీసు నుండి వచ్చేవేళ. వీధి వసారాలో పచార్లు చేస్తూ కూతురి రాక కోసం ఎదురు చూస్తున్నాడు రామం. అతని భార్య మూడు వీధుల అవతల లాయర్ గారింట్లో శ్రావణ మంగళవారం పేరంటానికి వెళ్ళింది. అనుకున్నట్లుగా కూతురికి ఈ సంవత్సరం పెళ్ళి చేసి ఉంటే తమ ఇంట్లోనే ఈ రోజున బోలెడు హడావిడిగా ఉండేది. పట్టుచీర కట్టుకుని, కాళ్ళకి పసుపు రాసుకుని నోము నోచుకుంటున్న కూతురు కళ్ళముందు కదలాడింది.

వానకి గాలి తోడయి జల్లు వసారాలోకి విసర సాగింది. చేస్తున్న పచార్లు ఆపి రామం ఇంటి గేటు వయిపు ఆ తరువాత వీధి చివరి వరకు మరోసారి చూసాడు. 'వర్షం ఎక్కువవుతోంది, సౌమ్య తొందరగా వస్తే బావుండును' అనుకున్నాడు.

ఇంతలో ఫోన్ మ్రోగింది. అతను లోపలికి నడిచి ఫోన్ అందుకున్నాడు. అవతల నుండి భార్య, వర్షం తగ్గాక వస్తానని చెప్పింది. అప్పటికి నాలుగురోజులనుండి ఫోన్ సరిగ్గా పనిచెయ్యటంలేదు. రేపు మరచిపోకుండా కంప్లైంట్ ఇవ్వాలి అనుకుంటూ మళ్ళీ వీధి వసారాలోకి వచ్చాడు.

ఇంజినీరింగ్ చదివాక కొడుకు అమెరికాలో ఎం.ఎస్‌కని వెళ్ళకుండా ఉంటే ఈ పాటికి సౌమ్యకి పెళ్ళిచేసేసి ఉండేవాడు. ఇంట్లో అందరు ఒక్కటిగా నచ్చచెప్పటంతో ఉన్నా కొద్దిపాటి సేవింగ్స్ ఇచ్చి కొడుకుని అమెరికా పంపించాడు. డిగ్రీ పాస్ అయిన సౌమ్య ఈలోగా బ్యాంకు జాబులో చేరింది. కొడుకు ఎం.ఎస్. పూర్తయి జాబులో చేరగానే కూతురికి పెళ్ళి చెయ్యాలని రామం ఆలోచన.

వీధి చివరి వరకు మరోసారి చూసి, ఈ వర్షం ఇప్పుడే రావలనుకుంటే ఎక్కడలేని చిరాకు వేసింది. మనసు ఏమాత్రం కలత పడ్డ తేరుకోవటానికి అతడు తనదయిన ఊహా ప్రపంచంలోకి వెళ్ళిపోతాడు.

మావిడాకు తోరణాలు కట్టిన పందిరి, పెళ్ళి బట్టల్లో కూతురు, అల్లుడు పెద్దవాళ్ళకి నమస్కారాలు పెట్టి ఆశీర్వచనాలు తీసుకుంటూ..

పూల బుట్టలా ఉన్న కారులోకి ఎక్కుతున్న సౌమ్య, వెనుకగా బరువెక్కిన గుండెతో మరింత బరువుగా ఉన్న సూటుకేసు మోస్తూ తను, ఈలోగా "మీరు ఉండండి మావయ్యగారు" అంటూ కొత్త అల్లుడు అవలీలగా తన చేతిలోని సూటుకేసు అందుకుని కారులో పెట్టేస్తూ..

అలా ఊహించుకుంటూ ఉంటే అతని మనసు తేలిక అయింది. కొడుక్కి ఉద్యోగం వచ్చినా లేక పోయిన మళ్ళీ శ్రావణమాసం కల్లా కూతురి పెళ్ళి చేసెయ్యాలి అనుకున్నాడు.

మళ్ళీ ఫోన్ మ్రోగసాగింది. వీధి చివరి వరకు మరోసారి చూసి అతను ఇంట్లోకి వచ్చాడు.

ఫోన్ అందుకుని "హలో" అన్నాడు.

ఫోన్ అసలే ఫాల్ట్‌గా ఉంది, పైగా వర్షం.

గరగరమంటూ ప్లాస్టిక్ పేపర్ని నలిపితే వచ్చేలాంటి చప్పుళ్ళ మధ్య "హలో" అని వినిపించింది. ఈసారి మరింత గట్టిగా "హలో, ఎవరూ' అన్నాడు రామం.

అతని గొంతు వినగానే అవతల ఆ అమ్మాయి "నాన్న, నాన్న" అంటూ గట్టిగా ఏడవసాగింది. ఒక్కక్షణం బిత్తరపోయి "..ఏంటమ్మా.. ఏంటీ..." అంటూ అరిచాడు.

ఆ అమ్మాయి ఏడుపు మరింత ఉధృతం అయింది.

'ఎందుకింతలా ఏడుస్తోంది, ఏమయి ఉంటుంది, యాక్సిడెంట్ కాని అవలేదు కదా..' అతని గుండె ఒక్కసారి ఆగి కొట్టుకోవడం మొదలు పెట్టింది. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి.

"ఏడుపు ఆపి అసలేమయిందో చెప్పు" అంటూ ఉంటే గొంతు బొంగురుపోయింది.

అలాగే వెక్కి వెక్కి ఏడూస్తూ "నాన్న.. నన్ను క్షమించు నాన్న..." అంటూ ఈసారి మరింత బోరుమంది.

రామానికి అంతా అయోమయంగా అనిపించింది. క్షమించమంటుంది ఎందుకు, అసలేం మాట్లాడుతోంది.

"నీకెలా చెప్పాలో అర్థం కావటంలేదు నాన్న.. ఐయాం రియల్లీ సారీ నాన్న.. అతడు, అతడూ.." అంటూ ఆమె ఏడుపు ఆపి ఏదో చెప్పడానికి ప్రయత్నం చేస్తోంది.

మధ్యలో ఈ అతడు.. ఎవరు? అనుకుంటే, మొన్న తల్లీ, కూతుర్లు ఘర్షణ పడడం గుర్తుకు వచ్చింది. తల్లి ఏవో పెళ్ళి సంబంధాల లిస్టు చదువుతుంటే సౌమ్య విసుగ్గా "నా మొగుడ్ని నేనే చూసుకుంటాను" అనడం గుర్తుకు వచ్చింది. ఎవడినయినా చేసుకుని వెళ్ళిపోలేదు కదా.. ఒక్కసారిగా రక్తప్రసరణ పెరిగి, అతడికి కాళ్ళనుండి తలవరకు వేడి సెగ పాకినట్లయింది.

"అసలేం అంటున్నావు... నాకేమి అర్థంకావటం లేదు.." అంటువుంటే అతని గొంతు కీచుగా అయిపోయి ఫోన్ చేస్తున్న శబ్దాల మధ్య కలిసి పోయింది.

దుఃఖం ఆపుకుంటూ ఆమె తిరిగి అంది "అతడు.. మోసగాడు నాన్న, నన్ను వదిలి వెళ్ళిపోయాడు."

వింటున్న అతనికి ఈసారి పూర్తిగా మతిపోయింది.

"ఏమిటా పిచ్చివాగుడూ?.. అసలేం మాట్లాడుతున్నావు నువ్వు?.." అంటూ గటిగా అరుస్తుండగా ఒక్కసారిగా ప్రక్కనున్న కిటికీ రెక్క ఠపీమని తెరుచుకుని రయ్యిమని వాన జల్లులోపలికి కొట్టింది.

అనుకోని ఆ విసురుకి అతడు తూలాడు. జారిపోబోయిన ఫోనుని గట్టిగా చెవికి నొక్కిపట్టాడు. వణుకుతున్న మరో చేతిని స్వాధీనంలోకి తెచ్చుకుని గాలికి కొట్టుకుంటున్న కిటికీ తలుపు వేస్తుండగా కనిపించింది.. గేటు తీసుకుని వస్తూ సౌమ్య.

అతడొకసారి అయోమయంగా ఫోన్ కేసి, ఇంట్లోకి వస్తున్న కూతురికేసి తేరిపార చూసాడు.

ఏడుపు ఉధృతం కాస్త తగ్గినట్లయి అవతల ఆ అమ్మాయి అంటోంది "నన్ను ఇంటికి రమ్మని చెప్పునాన్న.. నేను వచ్చేస్తాను".

అతడికి ఏం మాట్లాడాలో తెలియలేదు.

"ఒక్కసారి నీ నోటితో నువ్వు రమ్మని పిలువు నాన్న.. ప్లీజ్ నాన్న.. నాకు ఇంటికి వచ్చెయ్యాలని ఉంది నాన్న...."

అతను ఒకసారి గొంతు సవరించుకుని గట్టిగా ఆమెకి వినిపించేలా చెప్పాడు "రా అమ్మా, ఇంటికి వచ్చేయ్ తల్లీ". ఒక్క క్షణం ఆగి మరోసారి అవే మాటలు తిరిగి అన్నాడు.

"..రేపొద్దున్న బస్సుకే బయలుదేరుతాను నాన్న."

ఫోన్ డిస్కనెక్ట్ అయింది. మూడు నిమిషాల ఫోను కాల్‌తో మూడు లోకాలు చుట్టినట్లు అయి అతను ప్రక్కనున్న కుర్చీలో కూర్చుండిపోయాడు.

వసారాలో ఉన్నా టవల్ తీసుకుని తల తుడుచుకుంటూ ఇంటిలోకి వచ్చింది సౌమ్య.

నవ్వుతూ తండ్రికేసి చూసి "లేటయితే నువ్వు కంగారు పడతావని, తడుస్తూ వచ్చేసాను. ఇంతోటి వానకి మొక్క మొలచిపోతానా ఏమిటి?" అంది.

అతనేమి మాట్లాడలేదు.

లోపలికి వెళ్ళబోయి ఆగి అడిగింది "ఎవరు నాన్నా ఫోను?".

"ఎవరోనమ్మా..!!" అంటూ ఆగిపోయాడు.

ఎందుకో మరి "రాంగ్ నెంబర్" అని అనాలనిపించలేదతనికి.

●●●

**Click here to share your comments on this story**